ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి



చీమకుర్తిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



కొత్తపట్నంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్
- చీమకుర్తిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

చీమకుర్తి: ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ గురువారం రాత్రి చీమకుర్తి పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీ చంద్రశేఖరరెడ్డిని పార్టీ అధిష్టానం నిలబెట్టినందున వారిని అత్యధిక మెజార్టీతో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు వారు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు కల్పించే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల, రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు బాపతు వెంకటరెడ్డి, నలమలపు మాణిక్యం, స్థానిక కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది

వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించాలని, ఓటర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సమస్యలు పరిష్కరిస్తుందని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కోరారు. గురువారం సంతనూతలపాడు మండలంలోని సంతనూతలపాడు, మంగమూరు, బొడ్డువారిపాలెం, తక్కెళ్లపాడు, వేములపాడు, చిలకపాడు, గుమ్మళంపాడు గ్రామాలతో పాటు పేర్నమిట్ట పరిధిలోని ఒంగోలు 43వ డివిజన్‌లో ఎమ్మెల్యే టీజేఆర్ సుడిగాలి పర్యటన చేశారు. వైఎస్సార్ సీపీ తరఫున తూర్పు రాయలసీమ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీ చంద్రశేఖరరెడ్డి పోటీచేస్తున్నట్లు తెలిపారు. వారికి సంబంధించిన కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, బొల్లినేని కృష్ణయ్య, దుంపా యలమందారెడ్డి, కండే స్వాతి, రమణయాదవ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఓటర్లను అభ్యర్థిస్తున్న ఒంగోలు ఎంపీపీ మల్లికార్జునరెడ్డి , ఇతర నేతలు

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

ఒంగోలు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని మండలంలోని మండువవారిపాలెం, అంబేడ్కర్ నగర్, గుండాయపాలెం, దేవరంపాడు గ్రామాల్లో నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి అంకయ్య, సచివాలయ కన్వీనర్ చప్పిడి సోమశేఖర్, సచివాలయ కన్వీనర్‌లు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. గుండాయపాలెంలో జరిగిన ప్రచారంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పేతురు, బాబులు పాల్గొన్నారు. ముక్తినూతలపాడు రెండో డివిజన్‌లో నేతలు ప్రచారం చేశారు.

కొత్తపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం మండలంలో కె.పల్లెపాలెం, రంగాయపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓట్ల జాబితాను తీసుకుని గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఓటర్ల నివాసానికి వెళ్లి కలుసుకుని పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అభ్యర్థులకు సంబంధించిన ఓటు కరపత్రాలు పంపిణీ చేశారు. అదే విధంగా ఈతముక్కలలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇంటింటి ప్రచారం చేశారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అలూరు, మడనూరు, కొత్తపట్నం, అల్లూరు గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగింది. జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీ శారద, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, సైకం రాంబాబు, నాగార్జున, వెంకట్రావు, కసుకుర్తి శ్రీను, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ట



దత్తాత్రేయ విగ్రహం

ఒంగోలు టౌన్: నగరంలోని సాయిబాబా మందిరంలో గురువారం దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతి స్వామి సమక్షంలో అత్యంత వైభవంగా జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి ప్రారంభమైన విగ్రహ ప్రతిష్టలో తొలుత స్వామికి అభిషేకాలు, శాంతి కళ్యాణం చేశారు. వేడుకల్లో పీఠాధిపతులు మాతాజీ రమ్యానంద భారతి, పీఠ ప్రతినిధి ముని కృష్ణయ్య, ప్రెసిడెంట్ సుబ్బలక్ష్మి, సెక్రటరీ హరిప్రియ, కోశాధికారి శ్రీధర్, మందిర్ మేనేజర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేస్‌కు ఈసీఈ పరిశోధన కేంద్రం మంజూరు



జేఎన్‌టీయూ కాకినాడ పంపిన పత్రాన్ని ప్రదర్శిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎల్రక్టానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగానికి జేఎన్‌టీయూ కాకినాడ పరిశోధన కేంద్రం మంజూరు చేసిందని పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఆయన జేఎన్‌టీయూ కాకినాడ పంపిన లేఖను మీడియా ఎదుట ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధన కేంద్రం ద్వారా ఔత్సాహికులైన విద్యార్థులు అత్యాధునిక సౌకర్యాలు వినియోగించుకుని, పరిశోధనలు చేసేందుకు అవకాశం లభించిందన్నారు. అధ్యాపకులు తమ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు దోహదపడుతుందన్నారు. పరిశోధనకు అవసరమైన అన్ని సదుపాయాలను కాలేజీలోని ఈసీఈ విభాగం ప్రయోగశాలలో ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.రాజశేఖర్, ఆర్‌ఎండీ హెడ్ డాక్టర్ అనీల్‌కుమార్, దారా సురేష్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సుబ్బారావుకు నివాళి



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న శ్రీధర్

చీమకుర్తి: మన్నం సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ పేరుతో మన్నం సుబ్బారావుకు ఆయన కుమారుడు మన్నం శ్రీధర్, రాము సేవా కార్యక్రమాలతో ఘనంగా నివాళులర్పించారు. గురువారం మన్నం సుబ్బారావు వర్ధంతి సందర్భంగా చీమకుర్తిలోని బధిరుల పాఠశాలలో విద్యార్థులకు గ్రూప్ హియరింగ్ సిస్టం, ఇద్దరు పేద మహిళలకు రెండు కుట్టుమిషన్లు, మరొకరికి గ్రైండర్, ఎస్‌ఎస్‌పీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వంట పాత్రలు కలిపి దాదాపు రూ.30 వేల విలువ చేసే సామగ్రిని అందించారు. గత 20 సంవత్సరాలుగా బధిరుల పాఠశాలకు రూ.3 లక్షల విలువ చేసే వస్తువులను తమ తండ్రి సుబ్బారావు వర్ధంతిని పురస్కరించుకుని అందజేసినట్లు శ్రీధర్, రాము తెలిపారు. శ్రీధర్, రాము అందిస్తున్న సేవలు అభినందనీయమని డాక్టర్ బీ జవహర్ కొనియాడారు. పాఠశాల కరస్పాండెంట్ అంజిరెడ్డి, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కట్నం వేధింపుల కేసులో ఏడేళ్ల జైలుశిక్ష

ఉలవపాడు: కట్నం వేధింపుల కేసులో ఉలవపాడుకు చెందిన తన్నీరు వేణుకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఒంగోలు ఏడీజే కోర్టు గురువారం తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు..ఉలవపాడు వడ్డెరపాలేనికి చెందిన వేణుకు.. కీర్తితో వివాహమైంది. అయితే కట్నం వేధింపులు తాళలేక 2012 ఆగస్టు 12న నిప్పంటించుకొని కీర్తి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై వేణు, తల్లి లక్ష్మమ్మపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తదుపరి విచారణ తరువాత గురువారం వేణుకు ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు నిచ్చింది. కేసులో ఏ2 గా ఉన్న లక్ష్మమ్మ మరణించినట్లు తెలిపారు. బాధితురాలి తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చావలి రమేష్ కేసును వాదించారు.

పొగాకు వేలం ప్రారంభం

– తొలిరోజు కేజీ రూ.200 పలికిన ధర



పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు రూరల్: మండలంలోని పొగాకు వేలం కేంద్రం-2లో గురువారం వేలాన్ని బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ ప్రారంభించారు. వేలంలో పొగాకు ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ, పొగాకు బోర్డు మెంబర్లు మారెడ్డి సుబ్బారెడ్డి, పి.వర ప్రసాద్, ఐటీసీ మేనేజర్ శివకుమార్, జీపీఐ మేనేజర్ ప్రభాకర్, వేలం అధ్యక్షుడు వడ్డెళ్ల వరప్రసాద్, ఎ.శేషగిరి, వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి మాట్లాడుతూ పొగాకు బేళ్లు కట్టే సమయంలో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది కూడా గిట్టుబాటు ధర లభించాలని ఆకాంక్షించారు. పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు స్థిరమైన మార్కెట్ ధర కోరుకుంటున్నారని తెలిపారు. మార్కెట్ ఒడిదుడుకుల మధ్య రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వ్యాపారులు రూ.200 ధర స్థిరంగా ఉంచి వేలం మార్కెట్ కొనసాగాలని రైతులు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సంవత్సరం దాదాపు 70 శాతం నంబర్ పొగాకు పండిందని, లోగ్రేడ్ 30 శాతం మాత్రమే వచ్చిందని తెలిపారు. తుఫాన్లు, భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గత ఏడాది నాణ్యమైన పొగాకు, లోగ్రేడ్, మీడియం గ్రేడ్, మూడు గ్రేడుల పొగాకు ఒకే ధరలో వ్యాపారస్తులు కొనుగోళ్లు చేశారన్నారు. ఈ ఏడాది నాణ్యమైన పొగాకు అధిక శాతం దిగుబడి అయిన నేపథ్యంలో స్థిరమైన మార్కెట్ ధర రైతులకు రావాలని, మార్కెట్ ధర స్థిరంగా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని సరాసరి ధర రూ.200 ఉండేలా చూడాలని మారెడ్డి సుబ్బారెడ్డి వ్యాపారస్తులను, అధికారులను కోరారు. తొలిరోజు వేలానికి 27 బేళ్లు రాగా కేజీ రూ.200 చొప్పున అన్ని బేళ్లను కొనుగోలు చేశారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్ల సంఘ నాయకులు

చీమకుర్తి: పెన్షనర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్ల సంఘ నాయకులు, సభ్యులు గురువారం చీమకుర్తిలో తహసీల్దార్ పీ మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందించారు. పెన్షనర్ల సంఘ రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటంలో భాగంగా తొలుత మండల కేంద్రాలలో రెవెన్యూ అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకొస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. 2018 జూలై 1వ తేదీ నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏ అరియర్స్ చెల్లించాలని, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, 2023 జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రావాల్సిన నూతన పీఆర్సీకి కమిటీ వేయాలని, పలు రకాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నట్లు పెన్షనర్ల సంఘ నాయకులు మద్రి లక్ష్మీనారాయణ, బండ్ల డేవిడ్, పర్చూరి సుబ్బారావు, ఉప్పుతోళ్ల నారాయణ, తదితరులు తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

అదనపు విద్యుత్ లోడులపై తనిఖీలు

- రూ.3,66,500 జరిమానా విధింపు



జరిమానా విధిస్తున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

కొత్తపట్నం: విద్యుత్ విజిలెన్స్ అధికారులు మండలంలోని 15 పంచాయతీల్లో గురువారం తనిఖీలు చేశారు. మొత్తం 35 బృందాలుగా ఏర్పడి 2,823 ఇళ్ల సర్వీసులు, 250 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేశారు. తనిఖీల్లో తీసుకున్న లోడు కంటే అదనంగా వినియోగిస్తున్న వారిని గుర్తించి రూ.3,66,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా విద్యుత్ విజిలెన్స్ అధికారి ఎం అల్‌ఫాన్స్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగం పెరగడంతో ఎక్కువ మంది తీసుకున్న దాని కంటే అదనంగా లోడు వాడుకుంటున్నారని తెలిపారు. విద్యుత్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని సూచించారు. అదనపు వినియోగానికి ఒకసారి చెల్లిస్తే మళ్లీ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ టి.శ్రీనివాసరావు, విజిలెన్స్ డీఈఈ ఏ.శ్రీనివాసరావు, రూరల్ డీఈఈలు ఆర్ మోహన్‌రావు, జి.వినయ్‌కుమార్‌రెడ్డి, విజిలెన్స్ ఏఈఈ పి.మౌలాలిఖాన్, ఏఈఈ జి.వీరాంజనేయులు, టెక్నికల్ అసిస్టెంట్ మాధవరావు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి



కుంట పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శీనారెడ్డి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీఓ

- డ్వామా పీడీ శీనారెడ్డి

మద్రిపూడి: గ్రామాలల్లో రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించి ఉపాధి కూలీలతో చేయించాలని డ్వామా పీడీ శీనారెడ్డి ఆదేశించారు. మండలంలోని చిమట గ్రామంలో నంద్యాలవారి కుంటలో ఉపాధి హామీ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ.. అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు పంట పొలాల్లో నీటికుంటలు పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. కుంటకు రాతి కత్తువలు ఏర్పాటు చేసి అధికమైన నీరు బయటకు వెళ్లేలా అలుగు నిర్మించాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ కోసం టెంట్, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలన్నారు.అనంతరం మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో వాటర్‌షెడ్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన వెంట ఏపీఓ వెంకట్రావు, ఈసీ బషారతుల్లా, టెక్నికల్ అసిస్టెంట్, ఎఫ్ఏలు ఉన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

కందుకూరు రూరల్: మండలంలోని కొండముడుసుపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ ఎల్ సుజాత గురువారం పరిశీలించారు. గ్రామంలో కందుకూరు పంట కాలువలో పనిచేస్తున్న కూలీలతో ఆమె మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా పంట కాలువలను ఎంపిక చేసి పనులు చేయిస్తున్నామన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి



గర్భిణులకు భోజనం అందజేస్తున్న వైద్యాధికారి

కొత్తపట్నం: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి అన్నారు. ప్రధానమంత్రి మాతృ సురక్ష యోజన కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో 64 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉన్న వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలల్లో నాణ్యమైన వైద్యం అందుతున్నారన్నారు. నాడు-నేడు నిధులతో హాస్పిటల్‌ను సుందరంగా తీర్చిదిద్దారన్నారు. గర్భిణులకు డీఎంహెచ్‌ఓ మాధవీలత సొంత నగదుతో భోజనాలు ఏర్పాటు చేశారు. యూడీసీ కూచిపూడి శరత్, ప్రమీణ, విజయభారతి, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాయివిష్ణు విల్లాస్‌కు ఎస్‌బీఐ అప్రూవల్



రవిశంకర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎస్‌బీఐ డీజీఎం

నాగులుప్పలపాడు: జిల్లాలో మొట్టమొదటిసారిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు చదలవాడ సమీపంలోని సాయివిష్ణు విల్లాస్ చతుర్వాటిక ప్రాజెక్టును అప్రూవ్ విల్లా ప్రాజెక్టుగా గుర్తిస్తున్నట్లు ఎస్‌బీఐ డీజీఎం దినేష్ గులాటి తెలిపారు. ప్రాజెక్టు అప్రూవల్ సర్టిఫికెట్‌ను రవిశంకర్ గ్రూప్ చైర్మన్ కంది రవిశంకర్‌కు గురువారం అందజేశారు. చదలవాడలోని సాయివిష్ణు విల్లాస్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీజీఎం దినేష్ గులాటి మాట్లాడుతూ హైదరాబాద్ సిటీకి మించి ఈ ప్రాజెక్టు ఉందన్నారు. ఎస్‌బీఐ అప్రూవ్ ప్రాజెక్టుగా గుర్తించడం ద్వారా విల్లా కొనుగోలు చేసిన వారికి 24 గంటల్లోనే లోను అప్రూవల్ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు, ఒంగోలు ఎస్‌బీఐ ఆర్‌ఎం శ్రీకాంత్, సుబ్రహ్మణ్యం, ఏజీఎం వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో చోరీ

- రూ.1.60 లక్షల విలువైన ఆభరణాలు, రూ.20 వేల నగదు చోరీ

కనిగిరి రూరల్: పట్టణంలోని ఓ ఇంట్లో చోరీ జరిగి రూ.1.60 లక్షల విలువైన ఆభరణాలు, రూ.20 వేల నగదు అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం..పట్టణంలోని శివనగర్ కాలనీకి చెందిన పి. కాశమ్మ ఇంట్లో దొంగలు పడి ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి బీరువా తాళం పగులగొట్టి అందులోని సుమారు రూ.20 వేల నగదు, సుమారు 15 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. బాధితురాలు పి.కాశమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూడు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు



కొల్లూరుపాడు అండర్‌పాస్ పై లారీని ఢీకొన్న బైకు.

ఉలవపాడు: మండల పరిధిలోని జాతీయరహదారిపై గురువారం జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. కొల్లూరుపాడు అండర్ పాస్ పైన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొనడంతో బైకు నడుపుతున్న కావలి మండలం తుమ్మలపెంటకు చెందిన మోహనరావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. రాజుపాలెం జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని కారు ఢీకొనడంతో బైకు మీద ఉన్న ఉలవపాడు మండలం బద్దిపూడికి చెందిన వినయ్, శ్రీదేవిలకు గాయాలయ్యాయి. వీరిని పోలీసు వాహనంలో ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. రాజుపాలెం రత్నసాయి సురక్షిత మందిరం వద్ద హైవే నీటి వాహనాన్ని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెదపట్టపుపాలెంకు చెందిన వాయల తిరుపతి, చాకిచర్లరెడ్డిపాలెంకు చెందిన పెల్లేటి రమణయ్యలకు గాయాలయ్యాయి. వీరిని 108 సిబ్బంది కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

వాసన్నకు కృతజ్ఞతలు



బాలినేనిని సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న బడుగు ఇందిర

ఒంగోలు: మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పదవి రావడానికి కారకులైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిలకు బడుగు ఇందిర కృతజ్ఞతలు ప్రకటించారు. ఈ మేరకు బాలినేనిని ఆయన నివాసంలో దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అన్నారు. నామినేటెడ్ పదవులు, ఇతర పదవుల విషయంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఒంగోలుకు చెందిన బడుగు ఇందిర ఎన్నో ఏళ్లుగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారని, అందువల్లే ఆమెకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జోనల్ ఇన్‌చార్జి బాధ్యతను అప్పగించారన్నారు. 2024 ఎన్నికల్లో పార్టీని మూడు జిల్లాలైన పల్నాడు, ప్రకాశం, బాపట్లలో బలోపేతం చేసేందుకు మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, పట్టభద్రుల ఎంఎల్‌సీ అభ్యర్థి .పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న దళిత నాయకులు



ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇస్రాయేల్, ఎంపీ నందిగం సురేష్‌తో సంతనూతలపాడు నాయకులు

చీమకుర్తి: ఎమ్మెల్యే కోటాలో వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న బొమ్మి ఇస్రాయేల్‌కు మద్దతుగా సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు దళిత నాయకులు గురువారం నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్రాయేల్‌తో పాటు ముఖ్య అతిథిగా హాజరైన బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఇద్దరినీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి గృహ నిర్మాణ శాఖ డైరెక్టర్ కొలకలూరి విజయకుమార్, సంతనూతలపాడు ఎంపీపీ బీ విజయ, తేళ్ల భాగ్యలక్ష్మి, మల్లెల జాన్సన్, జడ రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను తనిఖీ చేసిన ఏపీడీ



పనులను పరిశీలిస్తున్న ఏపీడీ వెంకటస్వామి

మద్దిపాడు: మండలంలోని రాచవారిపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా జిల్లా విజిలెన్స్ ఒంగోలు క్లస్టర్ ఏపీడీ పాలేటి వెంకటస్వామి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పొలాల్లో జరుగుతున్న ఫీల్డ్ ఛానల్ పనిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ఉపాధి కూలి పనులకు వచ్చిన వారు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే ప్రతి ఒక్కరికీ రోజుకు రూ.257 వేతనం లభిస్తుందని తెలిపారు. కూలీల సంఖ్య పెంచుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఉపాధి కూలీలకు హాజరు పక్కాగా వేయాలని, పని జరిగే ప్రదేశాలలో మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధుల సహకారంతో పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది ఎటువంటి అవకతవకలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఈ కిషోర్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.